క్లుప్తంగా

చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల డెప్యూటీ కమిషనర్‌గా దాసరి



మోపిదేవి: చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల నూతన డెప్యూటీ కమిషనర్‌గా దాసరి శ్రీరామ వరప్రసాదరావును ప్రభుత్వం నియమించింది. ఆయన గుంటూరు జిల్లా పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో డెప్యూటీ కమిషనర్‌గా పని చేస్తూ బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న నల్లం సూర్య చక్రధరరావు తూర్పు గోదావరిజిల్లా వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన శ్రీరామ ప్రసాదరావుకు మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. తొలుత స్వామి వార్లను దర్శించుకుని అనంతరం ఆలయ బాధ్యతలు స్వీకరించారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

పెడన: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడానికి చర్యలు తీసుకోవాలని సీనియర్ కౌన్సిలర్, మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త కటకం ప్రసాద్ అన్నారు 'స్వచ్ఛతా హీ సేవ–2024'లో భాగంగా పెడన పురపాలక సంఘం పరిధిలోని 13, 14వ వార్డుల్లో వనం మనం కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కటకం ప్రసాద్ మాట్లాడుతూ మొక్కలను ప్రతి ఒక్కరూ నాటుతారని, వాటిని బతికించేలా సంరక్షిస్తూ ఉంటేనే సమాజం నిత్యం పచ్చగా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. మున్సిపల్ కమిషనర్ గోపాల్‌రావు, కౌన్సిలర్ తిప్పా లక్ష్మీ నరసమ్మ, పూర్ణచంద్రరావు, వార్డు మేస్త్రీలు, శానిటరీ కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

రైతులకు ఈకేవైసీ తప్పనిసరి

కోడూరు: పంటకు సంబంధించి రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీధర్ కోరారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఏఓ.. విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ రాయితీలు, పథకాలు పొందడానికి ఈ–కేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఇది చేస్తేనే ఈ–పంట ప్రక్రియ పూర్తవుతుందన్నారు. వీటి నమోదుతో రాబోయే కాలంలో ధాన్యం అమ్ముకోవడానికి, పంట బీమా, ఈ–పంట ధ్రువపత్రం పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే పథకాలు కూడా దీనికి ముడిపడి ఉన్నాయని ఏఓ తెలిపారు. రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో ఈ నెల 28వ తేదీ లోపు నమోదు ప్రక్రియ చేయించుకోవాలని సూచించారు.

ఆటలతో శారీరక, మానసిక శక్తి పెంపు



మోపిదేవి: మానసిక, శారీరక శక్తిని పెంపొందించడానికి ఆటలు ఉపయోగపడతాయని మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు రావి దుర్గావాణి అన్నారు. స్థానిక గురుకుల పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు సోమవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన విద్యార్థులు ఉల్లాసంగా ఉంటారని, చదువులో కూడా చురుకుదనం ఏర్పడుతుందని వివరించారు. అనంతరం వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, చెస్, షటిల్ బ్యాడ్మింటన్ యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.వీరరవి, ఎంఈవో ఎస్.దుర్గాసాగర్, ఎంఈవో–2 పిచ్చయ్య పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

స్వామివార్ల దేవస్థానంలో స్వచ్ఛతాహీ సేవ



మోపిదేవి: మోపిదేవిలోని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం, పెదకళ్లేపల్లిలో వేంచేసియున్న శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామివార్ల దేవస్థానంలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆలయ ఏసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు నేతృత్వంలో ఉదయం స్వయంగా చీపుర్లు చేతపట్టి భోజనశాలను శుభ్ర పరిచారు.

27న ఉచిత మెగా వైద్యశిబిరం

అవనిగడ్డ: మాజీ మంత్రి మండలి వెంకటకృష్ణారావు వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 27వ తేదీన ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు గాంధీక్షేత్ర కమిటీ అధ్యక్షుడు మత్తి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ యువజన వికాస సమితి, గాంధీ క్షేత్ర కమిటీ, కోడూరు లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన హెచ్‌సీజీ క్యాన్సర్ హాస్పటల్, క్యాపిటల్ హాస్పటల్ సౌజన్యంతో జరిగే వైద్యశిబిరంలో ఎముకల సంబంధిత పరీక్షలు, చెవి ముక్కు గొంతు, జనరల్ పరీక్షలను ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు.

బదిలీల పర్వం

అన్ని శాఖల్లోనూ.. అటెండర్ నుంచి మండల స్థాయి అధికారుల వరకు స్థానచలనం



పెడన తహసీల్దార్ కార్యాలయం

పెడన: బదిలీల పర్వం తుది దశకు చేరుకోవడంతో పాటు ఒకేసారి కార్యాలయంలో విధులు నిర్వహించే 90 శాతం మందికి స్థానచలనం కావడం విశేషం. పెడనలోని వివిధ శాఖల్లో ఉద్యోగుల బదిలీలు ఇలా ఉన్నాయి. నియోజకవర్గంలోని పెడన తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉంది. కృత్తివెన్ను ఎంపీడీవో రాంబాబు ఇటీవల పదవీ విరమణ చేయడంతో ఖాళీ ఏర్పడింది. ప్రస్తుతం బంటుమిల్లి ఎంపీడీవో జె.స్వర్ణభారతి మోపిదేవికి బదిలీ అయ్యారు. తహసీల్దార్ కార్యాలయంలో డెప్యూటీ తహసీల్దార్ కె.పూర్ణచంద్రరావు బంటుమిల్లికి బదిలీపై వెళ్లగా ఆర్ఐ మణికుమార్ కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. పెనమలూరులో డీటీగా ఉన్న అనిల్‌కుమార్‌ను పెడనకు బదిలీ చేశారు. ఎన్నికల విభాగంలోని డెప్యూటీ తహసీల్దార్ కల్పన, సీనియర్ అసిస్టెంట్ శ్యామ్‌కుమార్, రీ సర్వే డీటీ సత్యనారాయణ బదిలీ అయ్యారు. వీరి స్థానాల్లో పలువురిని నియమించినట్లు సమాచారం. బంటుమిల్లి తహసీల్దార్ కార్యాలయంలో డీటీ రామశివ గుడివాడకు బదిలీ అవ్వగా, జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్ డీఎస్‌వో కార్యాలయానికి, ఆర్ఐ శేఖర్ మచిలీపట్నం నార్త్ తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్ ఆర్ ఆర్ శేఖర్ బంటుమిల్లికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మొవ్వ నుంచి ఎల్.వెంకటేశ్వరరావు రానున్నారు. సీనియర్ అసిస్టెంట్ శర్మ బదిలీ అయ్యారు. జూనియర్ అసిస్టెంట్లు పి.విజయకుమార్ మండవల్లికి, ప్రసన్నలు బదిలీ అయ్యారు. అటెండర్ ప్రకాష్‌కు స్థానచలనం కలిగింది
- పెడన ఎస్ఐ సత్యనారాయణకు ప్రమాదం జరిగి సెలవులో ఉండటంతో వీఆర్‌లో ఉన్న నరసింహమూర్తికి ఇన్‌చార్జి ఎస్ఐగా బాధ్యతలను అప్పగించడంతో ఆయన సోమవారం విధుల్లో చేరారు.
- ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వి.రెడ్డయ్య పశ్చిమగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. జూనియర్ అసిస్టెంట్ ప్రకాష్ బదిలీ అయ్యారు. వీరి స్థానాల్లో ఇంకా ఎవరిని నియమించలేదు. వీరిలో కొందరు ఇంకా రిలీవ్ ఆర్డరు తీసుకోగా మరికొందరు తీసుకోవాల్సి ఉంది. వీఆర్వోలు సైతం కదలనున్నారు. ఇప్పటికే వీరు కౌన్సిలింగ్ దశలో ఉన్నారు. మంగళవారం సాయంత్రానికి పూర్తిగా సిబ్బంది, ఉద్యోగులు బదిలీల ప్రక్రియ ముగియనుంది.

ఘంటసాలకు గూడూరు ఎంపీడీఓ

గూడూరు: గూడూరు మండలంలో పనిచేస్తున్న పలువురు అధికారులు బదిలీ అయ్యారు. ఎంపీడీఓ డి.సుబ్బారావు ఘంటసాలకు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో ప్రస్తుతానికి ఎవరినీ నియమించలేదు. మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.రోహిత్‌ను జెడ్పీకి బదిలీ చేయగా ఆయన స్థానంలో జెడ్పీలో పనిచేస్తున్న రిజ్వానా బేగంను నియమించారు. మండల సర్వేయర్ జి.వెంకటేశ్వరరావు మచిలీపట్నం నగర పాలక సంస్థకు బదిలీపై వెళ్లగా కోడూరు మండల సర్వేయర్ కె.మురళీకృష్ణను గూడూరు మండల సర్వేయర్‌గా నియమించారు. తహసీల్దార్ కార్యాలయంలో డెప్యూటీ తహసీల్దార్‌గా గన్నవరం డీటీ(రీ సర్వే) పి.శ్రీనివాస్‌ను నియమించారు. జిల్లా సివిల్ సప్లయిస్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న టి.రాధను గూడూరు తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేయగా, గూడూరు ఎంఆర్ఐ షేక్ నస్రీన్ ఆరా కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. జూనియర్ అసిస్టెంట్ సీహెచ్ దినకర్ మచిలీపట్నం సౌత్ తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ అవ్వగా ఆయన స్థానంలో మచిలీపట్నం నార్త్‌లో పనిచేస్తున్న పి.ఝాన్సీ రాణిని నియమించారు.

బందరు కార్పొరేషన్‌లో అధికారులకు స్థానచలనం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరపాలక సంస్థ కార్యాలయంలో పనిచేస్తున్న పలువురు అధికారులు సాధారణ బదిలీల్లో భాగంగా వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీపీగా చేస్తున్న టి.మల్లికార్జునరావు గుంటూరు కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. ఇక్కడకు విశాఖపట్నం కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కె.గోపీనాథ్‌ను ఏసీపీగా నియమించారు. టీపీవో లావణ్య విశాఖపట్నం కార్పొరేషన్‌కు బదిలీకాగా తాడేపల్లిగూడెంలో పనిచేస్తున్న కె.శ్రీహరిప్రసాద్‌ను టీపీవోగా నియమించారు. టీపీఎస్‌గా పనిచేస్తున్న కె.శివసాయిని నిడదవోలు మునిసిపాల్టీకి బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎవర్నీ నియమించలేదు. మునిసిపల్ ఇంజినీర్ శ్రీనాథ్‌ను విజయవాడ గ్రీన్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో విజయవాడ కార్పొరేషన్‌లో పని చేస్తున్న చంద్రశేఖర్‌ను ఎంఈగా నియమించారు.

అంకితభావంతో పనిచేశారు

కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): భారీ వర్షాలు, కృష్ణానది, బుడమేరు వరదల్లో అధికారులు అంకితభావంతో పనిచేసి ప్రజలకు విశిష్ట సేవలు అందించారని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో సేవలు అందించిన అధికారులకు ఆత్మీయ అభినందన సభ, జిల్లా నుంచి బదిలీ అయిన అధికారులకు వీడ్కోలు కార్యక్రమాన్ని సోమవారం రాత్రి నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఇచ్చిన ఆదేశాలను పాటించి ప్రజలకు విశిష్టమైన సేవలు అందించారన్నారు. ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండి వరద ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి అన్ని సదుపాయాలను కల్పించడం అభినందనీయమన్నారు. అంతేకాకుండా తనతో పాటు సాధారణ ఎన్నికలు, విపత్కర పరిస్థితుల్లో తోడుగా నిలిచి జిల్లా ప్రజలకు సేవలు అందించి బదిలీ అవుతున్న అధికారులను ఆయన ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, ఆర్డీవోలు ఎం వాణి, పి.పద్మావతి, దాసి రాజు తదితర అధికారులు పాల్గొన్నారు.

స్పందన లేక 'మంచి ప్రభుత్వం' వాయిదా



మోపిదేవిలో ఖాళీగా దర్శనం ఇస్తున్న కుర్చీలు

మోపిదేవి: కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల విజయాలకు ప్రజల నుంచి స్పందన కొరవడటంతో వాయిదా వేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు గడిచిన సందర్భంగా సాధించిన విజయాలపై ఇది మంచి ప్రభుత్వం పేరుతో గ్రామ, వార్డుల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అంతంత మాత్రంగానే స్పందన ఉంది. మండల స్థాయిలో మోపిదేవిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రత్యేకంగా టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు వస్తారని ముందస్తుగా మైక్ ప్రచారం చేశారు. కూటమి నేతలు, ఉద్యోగులు చాలా తక్కువ మంది హాజరు కావడంతో ఖాళీ కుర్చీలు దర్శనం ఇచ్చాయి. చేసేదిలేక అనివార్యకారణాలతో వాయిదా వేసినట్లు ఎంపీడీవో కె. శ్రీనివాస్ ప్రకటించారు. ఎప్పుడు ఏర్పాటు చేసేది తర్వాత ప్రకటిస్తామని తెలిపారు.

వ్యాపారి ఇంట్లో చోరీ


చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నంలోని రైలుపేటకు చెందిన ఓ వ్యాపారి ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. షాహిద్ టెంట్‌హౌస్ నిర్వహిస్తున్న వ్యాపారి ఇంట్లో చోరీ జరిగిందని మచిలీపట్నం పోలీసులకు సమాచారం రావడంతో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ముదినేపల్లిలోని బంధువుల ఇంట్లో కార్యక్రమం నిమిత్తం కుటుంబ సభ్యులు ఈ నెల 22వ తేదీన అక్కడకు వెళ్లారు. వ్యాపారి షాహిద్ బేగ్ ఇంటికి తాళాలు పెట్టి సమీపంలోని తన సోదరుడు ఇంట్లో నిద్రించడానికి వెళ్లాడు. మరుసటిరోజు ఉదయం వచ్చి చూసే సరికి తాళాలు పగలకొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా 60 గ్రాముల బంగారంతో పాటు రూ. 1.20 లక్షల నగదు చోరీకి గురైనట్లు గ్రహించి మచిలీపట్నం పోలీసులకు వివరాలు తెలియజేశాడు. చోరీ ప్రాంతంలో క్లూస్‌టీం సిబ్బంది నిందితుల వేలిముద్రలను సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.ఏసుబాబు తెలిపారు.

ఔషధాల వినియోగంలో జాగ్రత్తలు అవసరం

గుడ్లవల్లేరు: రోగులు సూచించే ఔషధాల వినియోగంలో ఫార్మాసిస్టులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గుడ్లవల్లేరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎన్.గోపాల్ నాయక్ తెలిపారు. గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కాలేజీలో ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్(ఐడీఏ) గుడ్లవల్లేరు శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఔషధాల దుష్ప్రభావాల వలన కలిగే మరణాలు ఈ మధ్య కాలంలో పెరిగాయన్నారు. రోగికి ఔషధం అందించే ముందే అది రోగికి సరిపడుతుందా లేదా చూసుకోవాలని సూచించారు. ఆ ఔషధం వలన కలిగే అనుకోని దుష్ప్రభావాలతో పాటు అరికట్టే జాగ్రత్తలను వివరించారు. ఫార్మసీపై వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు మెమోంటోలు, ప్రశంసా పత్రాలను ఆయన బహూకరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు, ఐడీఏ గుడ్లవల్లేరు శాఖ ప్రెసిడెంట్ డాక్టర్ పి.రవీష, వైస్ ప్రెసిడెంట్ కె.పరిమళ, సెక్రటరీ ఎ.సాయిధాత్రి, మెంబర్ ఎస్‌కే నాగూర్ మీరావలి, అధ్యాపకులు డాక్టర్ టి.బాలకృష్ణ, డాక్టర్ ఎస్‌కే అమీనాబీ, డాక్టర్ టి.ప్రశాంతి, బి.సత్యశ్రీ, డాక్టర్ వి.రజని, కె.పరిమళ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ఎంపీడీవోకు వినతి పత్రం అందజేసిన ఉద్యోగులు



ఎంపీడీవో రెడ్డయ్యను కలిసి వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

పెడన: సచివాలయ ఉద్యోగుల విషయంలో వలంటీర్లు కంటే దారుణంగా విధులను అప్పగిస్తున్నారని, తక్షణం వారి సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవో రెడ్డయ్యను కలిసి సచివాలయ ఉద్యోగులు సోమవారం వినతి పత్రం అందజేశారు. దీనిలో వారి డిమాండ్లను తెలియజేస్తూ సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ఆ వినతి పత్రంలో తాము వలంటీర్ల మాదిరిగా రాజకీయ నేతల ద్వారా నియామకాలు చేపట్టలేదని, రాత పరీక్ష రాసిన ఇరవై లక్షల మందిలో కేవలం లక్షన్నర మంది మాత్రమే క్వాలిఫై అయి ఉద్యోగాలు పొందామన్నారు. విధుల్లో చేరినప్పుడు లేని పెన్షన్ పంపిణీ ఇప్పుడు బలవంతంగా చేయించడమే కాకుండా ముందు రోజే ఆయా గ్రామాల్లో బస చెయ్యాలని, లేదంటే ఉదయం నాలుగు గంటలలోపు మొదలు పెట్టాలని హుకుం జారీ చేయడంతో తీవ్ర వత్తిడికి గురవుతున్నామని వాపోయారు. కొంతమందికి రోడ్డు ప్రమాదాలు కూడా జరిగాయని పేర్కొన్నారు. తీవ్ర అనారోగ్యం బారిన పడుతున్నా పంటి బిగువున ఉద్యోగంలో నెట్టు కొస్తున్నామని ఆవేదన వెలిబుచ్చారు. జాబ్‌చార్ట్‌ను పూర్తిగా విస్మరించి కొత్తగా స్కూల్ టాయిలెట్ల ఫొటోలు తీయడం, వంద రోజుల ప్రభుత్వం గురించి కరపత్రాలు పంచడం, ప్రతి ఇంటికి స్టిక్కర్లు అంటించడం వంటి పనులు చేయించడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రభుత్వ ఉద్యోగం పేరుతో బానిసలుగా తమను వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ రెడ్డయ్య వీరి వినతి పత్రం స్వీకరించి పై అధికారులకు ఈ విషయాన్ని తెలియజేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీడీవోను కలిసిన వారిలో మండలంలోని సచివాలయాల ఉద్యోగులున్నారు.

అనారోగ్యంతో 'ఉపాధి' ఎఫ్ఏ మృతి

వక్కపట్లవారిపాలెం(నాగాయలంక): మండలంలోని వక్కపట్లవారిపాలెం పంచాయతీ పరిధిలో జాతీయ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మీసాల కోటేశ్వరరావు(ఎన్టీఆర్ కాలనీ)అనారోగ్యంతో ఆదివారం రాత్రి మరణించినట్లు ఏపీఓ ముత్యాలు తెలిపారు. అనారోగ్య కారణాలతో విజయవాడ ఆసుపత్రిలో మరణించగా మట్టి ఖర్చుల కింద ప్రభుత్వ తక్షణ సాయంగా రూ.15 వేలను సోమవారం కోటేశ్వరరావు కుమారుడికి అందజేశారు. ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం త్వరితగతిన అందించేందుకు కృషి చేస్తామన్నారు. సర్పంచి అంబటి శ్యామ్‌ప్రసాద్ తదితరులు కోటేశ్వరరావు భౌతికాయానికి శ్రద్ధాంజలి ఘటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కృత్తివెన్ను: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు కార్యాలయ సమావేశ మందిరంలో జరుగుతుందని ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.

బచ్చుపేట వెంకన్న ఆలయ ఈవోగా ఆంజనేయస్వామి

మచిలీపట్నంటౌన్: బచ్చుపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ఈవోగా సమ్మెట ఆంజనేయస్వామి నియమితులయ్యారు. విజయవాడలోని గుంటూరు సీతారామయ్య అన్న సత్రం ఈవోగా చేస్తున్న ఆయన్ను ఇక్కడకు బదిలీ చేశారు. గతంలో నగరంలోని రామలింగేశ్వరస్వామి, రంగనాయకస్వామి, గొడుగుపేట వేంకటేశ్వరస్వామి తదితర ఆలయాలకు ఈవోగా పనిచేశారు. ప్రస్తుతం మళ్లీ మచిలీపట్నంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఈవోగా నియమించారు.

విద్యార్థికి ఆర్థిక చేయూత

మచిలీపట్నంటౌన్: స్థానిక రెడ్‌క్రాస్ భవన వాచ్‌మెన్ గొరిపర్తి సారథి కుమారుడి చదువు నిమిత్తం స్థానిక యోగసభ సభ్యులు సోమవారం రూ. 10 వేల ఆర్థిక సాయం చేశారు. యోగా గురువులు గురునాథబాబు, చింతయ్య ఈ మొత్తాన్ని సారథికి అందజేశారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఈఈ ఎం.భాస్కరరావు, సమాచారశాఖ డీడీ ఎం.వెంకటేశ్వరప్రసాద్, యోగాసభ్యులు తమ్మన సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా బాణసంచా తయారీ వద్దు



కృత్తివెన్ను: అనుమతులు లేకుండా అనధికారికంగా ఎవరూ కూడా బాణసంచా తయారు చేయకూడదని బందరు డీఎస్పీ అబ్దుల్ సుభానీ అన్నారు. సోమవారం ఆయన పెడన సీఐ నాగేంద్రప్రసాద్‌తో కలసి చినగొల్లపాలెంలో బాణసంచా తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన తయారుదారుల వద్ద ఉన్న అనుమతులను పరిశీలించారు. బాణసంచా తయారు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వారికి వివరించారు. తనిఖీలో కృత్తివెన్ను ఎస్ఐ పైడిబాబు ఉన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

మండల పరిధిలోని మునిపెడ శివారులో అనధికారికంగా మద్యం విక్రయాలు చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ పైడిబాబు తెలిపారు. అతని నుంచి 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసి అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకోవడానికే..



పల్లెతుమ్మలపాలెం గ్రామంలో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఇచ్చిన హామీలను నెరవేర్చామని, ఇంకా ఏమైనా సమస్యలుంటే తెలుసుకుంటామని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మండల పరిధిలోని పోలాటితిప్ప, పల్లెతుమ్మలపాలెం, కోన గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి మాట్లాడుతూ ప్రజల అంచనాలకు అనుగుణంగా సుపరిపాలనను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ లంకే నారాయణప్రసాద్, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండి రామకృష్ణ, తహసీల్దార్ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల ఏకరవు

బంటుమిల్లి: మండల పరిధిలోని ముంజులూరులో నిర్వహించిన ప్రజావేదిక సభలో గ్రామస్తులు పలు సమస్యలను పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఎదుట ఏకరవు పెట్టారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాల్లో భాగంగా స్థానిక సచివాలయం వద్ద సోమవారం గ్రామ సభ నిర్వహించారు. మాజీ సర్పంచ్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే కాగిత మాట్లాడారు. అనంతరం గ్రామస్తులు పలు సమస్యలను ఆయన వద్ద మొరపెట్టుకున్నారు. ఇందులో భాగంగా కరంటు స్తంభాలపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. పంచాయతీ చెరువులను ఆక్రమించిన వ్యక్తులు గ్రామంలో మురుగునీరు వెళ్లకుండా అడ్డంకులు కలిగించారని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. గ్రామంలో అంతర్గత రోడ్లు నిర్మించాలని పలువురు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కాగిత విద్యుత్ ఏఈ రవికుమార్‌తో మాట్లాడి విద్యుత్ స్తంభాల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తొలుత గత ప్రభుత్వంలో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ నూతన భవనాన్ని ఎమ్మెల్యే కాగిత ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు సుమారు రూ. 25 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కూనపరెడ్డి సునీత, జేఎస్పీ పెడన నియోజకవర్గ సమన్వయకర్త పంచకర్ల సురేష్, మచిలీపట్నం టీడీపీ లీగల్ సెల్ కన్వీనర్ అంగర రంగనాథ్, తహసీల్దార్ భరత్‌రెడ్డి, ఏఈ నగేష్, టీడీపీ, జనసేన నాయకులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

గురువుగారు.. 'కూటమి' భజన..!

కోడూరు జెడ్పీ పాఠశాలలో క్రీడాపోటీలను పార్టీ కార్యక్రమంగా మార్చేసిన వైనం



సభలో కూటమి నేతలకు భజన చేస్తూ మాట్లాడుతున్న హెచ్‌ఎం వెంకటరమణ (ప్రొటోకాల్ పాటించకుండా వేదికపై కూర్చున్న నేతలు)

కోడూరు: విద్యాబుద్ధులు నేర్పి పాఠశాలను బాధ్యతగా నిర్వహించాల్సిన ఓ ప్రధానోపాధ్యాయుడు కూటమి నేతలకు భజన చేసిన ఘటన కోడూరు మండలంలో చోటు చేసుకుంది. స్వతంత్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన విద్యార్థులకు నిర్వహించే క్రీడా పోటీలను సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను పాఠశాల యాజమాన్యం ముఖ్య అతిథిగా ఆహ్వానించగా, ఆయన ఢిల్లీ వెళ్లడంతో రాలేదు. బుద్ధప్రసాద్ తనయుడు వెంకట్రామ్ (రాజా) కార్యక్రమానికి హాజరయ్యాడు. సీన్ కట్ చేస్తే.. పోటీలను ప్రారంభించడానికి హాజరైన వెంకట్రామ్‌ను స్వతంత్రపురం జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం ఆలా వెంకటరమణ పొగడ్తలతో ముంచెత్తారు. కూటమి నేతలను, కార్యకర్తలను కలుపుకొని వెంకట్రామ్ పని చేస్తున్నాడంటూ ఆయనకు భజన చేయడం ప్రారంభించాడు. ఇంతటితో ఆగకుండా కనీస ప్రొటోకాల్ పాటించకుండా టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన నేతలను కూడా సభా వేదికపై కూర్చోపెట్టి, వారితో కూడా మాట్లాడించారు. హెచ్‌ఎం తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ కార్యక్రమాన్ని పార్టీ కార్యక్రమంగా మార్చిందని తల్లిదండ్రులు బాహాటంగానే విమర్శించారు. మండల విద్యాశాఖ అధికారులు కూడా ఇదే వేదికపై ఓ మూలన కూర్చోవడం కొసమెరుపు.

దేశ చరిత్రలో చిరస్థాయిగా ఏచూరి

సీపీఎం జిల్లా సెక్రటరీయేట్ సభ్యుడు మాదాల వెంకటేశ్వరరావు



ఘంటసాలలో ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

ఘంటసాల: దేశ చరిత్రలో, సీపీఎం పార్టీలో ఏచూరి సీతారాం చిరస్థాయిగా నిలుస్తారని సీపీఎం జిల్లా పార్టీ సెక్రటరీయేట్ సభ్యుడు మాదాల వెంకటేశ్వరరావు అన్నారు. ఘంటసాల పార్టీ కార్యాలయంలో సోమవారం సీపీఎం మండల కమిటీ సమావేశం నేత బలే రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం అఖిల భారత కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు నేతలు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏచూరి ఎస్ఎఫ్ఐ విద్యార్థి ఉద్యమం నుంచి పార్టీ జాతీయ నాయకుడిగా ఎదిగారన్నారు. యునైటెడ్ ఫ్రంట్ నుంచి ఇటీవల ఇండియా వేదిక వరకు సమన్వయం చేయడంలో ఏచూరి పాత్ర దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. అటువంటి మహానాయకుడిని కోల్పోవడం తీరని లోటన్నారు. సమావేశంలో అక్టోబర్ 16న ఘంటసాల మండల మహాసభ నిర్వహించాలని తీర్మానించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మేడంకి వెంకటేశ్వరరావు, వెనిగళ్ల నాగమణి, జటావత్తు శివ శంకర్ నారాయణ, వాకా రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

పదివేల మందికి గణపతి అన్నప్రసాదం



నాగాయలంక ఉత్సవ పందిరిలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తజనం

నాగాయలంక: స్థానిక ప్రసన్న గణపతి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న నవరాత్రుల ఉత్సవ పందిరిలో సోమవారం 10 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. అన్నసమారాధనతో ఉత్సవాలు ముగిశాయి. తొలుత అన్న ప్రసాదానికి అర్చకుడు అంబా సాయి కిరణ్ శర్మ నేతృత్వంలో చిట్టా హరేకృష్ణ, వాణి దంపతులతో శాస్త్రోక్తంగా అన్న సమారాధన పూజ చేశారు. అనంతరం కమిటీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, చిట్టా వెంకట పూర్ణచంద్రరావు, బండ్రెడ్డి వెంకటేశ్వరరావు తదితర కమిటీ పెద్దలు ఉత్సవ పందిరిలో సమారాధన కార్యక్రమం లాంఛనంగా ప్రారంభించారు. శ్రీరామ పాదక్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, చిట్టా సాంబశివరావు, తాడికొండ సత్యనారాయణ, తలశిల నరసింహారావు(తాతయ్య), రాచంశెట్టి పాపారావు, సుఖవాసి యుగంధర్ తదితరులు పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న హరిశ్చంద్ర నాటకం

నాగాయలంక: స్థానిక ప్రసన్నగణపతి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక నవరాత్రి మహోత్సవాల్లో 17వ రోజు ఆదివారం రాత్రి ప్రదర్శించిన సత్యహరిశ్చంద్ర చారిత్రక–జానపద పద్య నాటకం ప్రేక్షకులను విశేషంగా అలరించింది. మత్స్యకార కళాకారుల పద్యనాటకాల నైపుణ్యాన్ని ఆదరిస్తూ అవనిగడ్డకు చెందిన విక్కుర్తి వీరరాఘవయ్య ట్రస్టు చైర్మన్ విక్కుర్తి శ్రీనివాసరావు, మత్స్యకార నేత చిలకలపూడి పాపారావు ఆర్థిక సౌజన్యంతో మండలంలోని వివిధ గ్రామాల మత్స్యకార రంగస్థల కళాకారులు ఈ పద్యనాటకాన్ని రసవత్తరంగా ప్రదర్శించారు. సొర్లగొందికి చెందిన కొప్పనాతి మౌలాలి నిర్వహణలో శ్రీరామ నాట్య మండలి ఆధ్వర్యంలో పలు గ్రామాల్లోని రంగస్థల నటులు పద్య గాన ప్రతిభతో అద్భుతంగా రాణించారు. నాటకంలో తొలి ప్రయత్నంలో రెండో హరిశ్చంద్రుడిగా ప్రతిభ చాటిన మత్స్యకార సంఘం జిల్లా నాయకుడు నాగిడి తాతారావును జిల్లా మత్స్యకార సహకార సంఘం డైరెక్టర్ కర్రి కృష్ణమూర్తి, లకనం నాగాంజనేయులు వేదికపై సన్మానించారు.